క్లుప్తంగా

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

నందివాడ: పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలకు నిధులను అందజేస్తున్నారని ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. నందివాడ సచివాలయంలో 21 మందికి ప్రభుత్వ రిజిస్టర్ చేసిన ఇళ్ల పట్టాల సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ డి.మల్లిక, సర్పంచ్ సరేళ్ల రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు మలిరెడ్డి కృష్ణారెడ్డి, సరేళ్ల నాగేశ్వరరావు, ఆర్ఐ వి.గణేష్ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్‌కు అంతర్జాతీయ మెడికల్ అవార్డు



గుడివాడ టౌన్: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ 2023 మెగా మెడికల్ క్యాంప్ అంతర్జాతీయ అవార్డు సాధించినట్లు క్లబ్ డిప్యూటీ గవర్నర్ అర్జా ప్రసాద్ తెలిపారు. 2023లో ఐదు వేల మందికి పైబడి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం, మందులు పంపిణీ చేయడం, 250 మంది బాల బాలికలకు ఉచిత కళ్లజోళ్లు పంపిణీ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మూడు వేల మందికి పైబడి తక్కువ ధరకు కళ్లజోళ్లు అందజేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించడం వలన ఇంటర్నేషనల్ బెస్ట్ మెడికల్ క్యాంప్ అవార్డు సాధించామన్నారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. సోమవారం అవార్డును మీడియాకు ప్రదర్శించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్‌లు బొగ్గారపు తిరుపతయ్య, ఎంఆర్ ప్రసాద్, జోన్ చైర్మన్ పాన్నూరు సత్యనారాయణ, మాజీ కార్యదర్శి వంగపండు బ్రహ్మజీ, కోశాధికారి చింతా రామకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వభారతి వార్షికోత్సవం



గుడివాడ టౌన్: విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. స్కూల్ డైరెక్టర్ ఆర్.మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం కూచిపూడి నృత్యాలు, జానపద నృత్యాలు ప్రదర్శించిన చిన్నారులకు కరాటే, రోలర్ స్కేటింగ్ వంటి క్రీడల్లో బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ ప్రిన్సిపాల్ రాధ, డైరెక్టర్ కీర్తి పాల్గొన్నారు.

చింతపాడులో సీసీ రోడ్లు ప్రారంభం



మండవల్లి: చింతపాడు, చింతపాడు పరిధిలోని దెయ్యంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ (జేవీఆర్) ఆదివారం రాత్రి ప్రారంభించారు. అనంతరం ప్రజా ఆశీర్వాదయాత్రలో పాల్గొన్నారు. ప్రజలకు ఎలాంటి లోటు ఏర్పడకుండా సంక్షేమ పథకాలను అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించి రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు.

'స్పందన'కు నాలుగు దరఖాస్తులు



గుడివాడ టౌన్: స్పందన కార్యక్రమానికి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ జి.బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బేతవోలుకు చెందిన పి.లక్ష్మి, ఎం.లక్ష్మి, ఎం.రజినిలు జగనన్న కాలనీలో తమ ఇంటి నిర్మాణం కోసం గతంలో చెల్లించిన సొమ్ము తిరిగి ఇప్పించాలని దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. ఇక ఆర్డీఓ కార్యాలయంలో గన్నవరానికి చెందిన ఎం.శ్రీనివాసరావు కుటుంబ ఆస్తుల పార్టేషన్‌కు సంబంధించి మ్యుటేషన్ సర్టిఫికెట్ ఇప్పించాలని దరఖాస్తు చేసినట్లు ఆర్డీఓ పి. పద్మావతి తెలిపారు.

రైతుల ఆర్థిక అవసరాలకు అండగా సొసైటీలు



కైకలూరులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డీఎన్నార్



ముఖాసాకలవపూడిలో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: రైతుల ఆర్థిక అవసరాలకు సొసైటీలు అండగా ఉంటూ వారి ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తున్నాయని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని ముఖాసాకలవపూడిలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం రూ. 30 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ నూతన భవనాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, త్రిసభ్య కమిటీ సభ్యుల చైర్ పర్సన్ గుడివాడ రాజేంద్రప్రసాద్, పరింకాయల వెంకటేశ్వరరావు, బి గోకర్ణయాదవ్, సర్పంచ్ బొప్పన వెంకట శ్యామలత పాల్గొన్నారు.

పెరికెగూడెంలో సొసైటీ భవనం ప్రారంభం

పెరికెగూడెంలో రూ.14 లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు కురేళ్ల యేసుమరియమ్మ, నాయకులు ముంగర మల్లికార్జునరావు, మెండా సురేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు గుడివాడ సత్యప్రసాద్, మాజీ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణ, సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

కైకలూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

కైకలూరు: కైకలూరు పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. స్థానిక సంతమార్కెట్ నుంచి శ్యామలాంబ ఆలయంలో వరకు రూ.15 లక్షల పంచాయతీ నిధులు, మరో రూ.15 లక్షలు మండల పరిషత్ నిధులు మొత్తం రూ.30 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కైకలూరులో రాళ్లకోడు డ్రెయిన్‌ను ఆధునికీకరించాలని అధికారులకు ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, వార్డు సభ్యులు మహ్మద్ గాలిబ్ బాబు, తోట మహేష్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఎండీ రఫీ

జుఝువరం(పామర్రు): జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2024 పోటీల్లో కటా విభాగంలో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఉషోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎండీ రఫీ పేర్కొన్నారు. మండల పరిధి జుఝువరంలోని ఉషోదయ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ చిలకలూరిపేటలో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ జాతీయ కరాటే చాంపియన్ షిప్–2024 పోటీలలో ఆరుగురు విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలలో విజేతలుగా నిలిచారన్నారు. 5వ తరగతికి చెందిన ఏ నోమినా ప్రథమ స్థానం సాధించిందన్నారు. జె.పార్థసారథి, జితేంద్ర, జ్ఞాన దీపిక్, పవన్ ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. బి పార్థసారథి తృతీయ స్థానం సాధించారన్నారు. కోచ్ వీవీ రామకృష్ణను ప్రిన్సిపాల్ అభినందించారు.

'గుడ్ మార్నింగ్ కైకలూరు'కు విశేష స్పందన

ఎమ్మెల్యే డీఎన్నార్



వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రార్థన చేస్తున్న ముస్లింలతో ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటూ పరిష్కారానికి సలహాలు ఇస్తూ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సంకల్పించిన గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం సోమవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. కైకలూరు ఇస్లాంపేటలో ఇంటింటికీ తిరుగుతూ ఎమ్మెల్యే ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సాంకేతిక కారణాల వల్ల పింఛను రావడం లేదని కొందరు మహిళలు చెప్పారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని పథకాలు అందుతున్నాయని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ని పార్టీలు, ఎంతమంది కలిసొచ్చినా రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. ముస్లిం పెద్దలు వైఎస్సార్ సీపీ విజయం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లిం నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, ఎస్‌డీ.బాషా, మహమ్మద్ గాలీబ్‌బాబు, ఎండీ ఆసీఫ్‌పాషా, సమయం అంజి, కూనవరపు సతీష్, ఉండ్రమట్ల ఏసుకుమార్, లాజర్, మాలిక్ షాబుద్దీన్, అబీద్ పాల్గొన్నారు.

భక్తి భావాన్ని అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు: ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక గంగానమ్మ తల్లి ఆలయంలో ఆదివారం రాత్రి విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరూ ఈ జాతరలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. వారం రోజులుగా ఆలయ కమిటీ సభ్యులు ఏ విధమైనా ఇబ్బందులు లేకుండా జాతరను నిర్వహించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, రానున్న కాలంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని కోరుతూ ప్రత్యేక పూజాధికాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, కో ఆప్షన్‌సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కూసంపెద వెంకటరెడ్డి, సూరవరపు కృష్ణ, కుందేటి రాణి, నవుడు శ్రీలక్ష్మీ, ఏ శివారెడ్డి, కొచ్చెర్ల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బొమ్మారెడ్డి వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



కలిదిండి: కలిదిండి గ్రామ పరిధిలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ పి.ప్రభాకర్‌రావు సోమవారం తనిఖీ చేశారు. బాలుర టాయిలెట్లు పూర్తయిన తర్వాత కూడా పిల్లలు వాటిని ఉపయోగించకుండా బయటకు వెళ్తున్నట్లు గుర్తించి ఉపాధ్యాయులు నాగమణి, సారవినోదినికి షోకాజ్ నోటీసు ఇచ్చామని ఎంఈఓ తెలిపారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు

గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్



గుడివాడ పట్టణంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్, పోలీసులు

గుడివాడరూరల్: రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా పోలీస్‌శాఖ అన్ని రకాల చర్యలు చేపడుతోందని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి గుడివాడ సబ్ డివిజన్‌కు సీఐఎస్ఎఫ్–287 విభాగానికి చెందిన 92 మంది కేంద్ర బలగాల పోలీసులను కేటాయించగా వారితో సోమవారం సాయంత్రం గుడివాడ పట్టణంలోని నెహ్రూచౌక్ నుంచి ఏలూరు రోడ్ మీదుగాపలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కేంద్ర బలగాలు ప్రవేశించినట్లు తెలిపారు. గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లో కేంద్ర బలగాలు కవాతు నిర్వహించి ప్రజలకు భరోసా కల్పించనున్నామని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వన్, టూ, రూరల్ సీఐలు కె.ఇంద్ర శ్రీనివాస్, ఎంవీ దుర్గారావు, కె.ఏసుబాబు, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో పూర్తి చికిత్స



గుడివాడ టౌన్: క్రమ పద్ధతిలో ఫిజియోథెరపీ చేయడం వలన దివ్యాంగులు పూర్తిగా నడవగలుగుతారని ఎంఈఓ ఐ.విజయ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సత్యనారాయణపురం లోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలో ప్రతి సోమవారం ఫిజియోథెరపీ శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. తల్లిదండ్రులకు వీటిపై అవగాహన కల్పిస్తామని తద్వారా వారు ఇంటివద్ద మానకుండా ఎక్సర్‌సైజ్ చేస్తే దివ్యాంగ చిన్నారుల్లో పెనుమార్పులు సంభవిస్తాయన్నారు. అనంతరం గుడివాడ మండలం వేల్పూరు గ్రామానికి చెందిన దొడ్డవరపు హవీలా దివ్యాంగురాలుకు సమగ్ర శిక్ష అందజేసినందుకు రూ. 10 వేలు విలువ చేసే సీపీ చైర్‌ను ఎంఈఓ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ పి. కామరాజు, రీసోర్స్ పర్సన్స్ ఎంకే నీలాంబ్రమ్, ఎస్కే ఫాజిల్లా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ముదినేపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయానికి డ్వాక్రా సభ్యులు ప్రాధాన్యం ఇవ్వాలని వెలుగు ఏపీఎం బత్తిన సత్యనారాయణ అన్నారు. మండలంలోని డ్వాక్రా గ్రూపు లీడర్లు, సభ్యులు, సీసీలతో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రకృతికి, మానవాళికి హాని చేయని సేంద్రియ ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించారు.

డైట్‌కు బీరువా వితరణ



డైట్‌కు బీరువాను అందజేసిన పూర్వ విద్యార్థులు

గుడ్లవల్లేరు: అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణా సంస్థ(డైట్)కు 1984–85వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బీరువా వితరణ ఇచ్చారు. సోమవారం డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణకు బీరువాను అందించారు. అధ్యాపకులు పి.వినయ్‌కుమార్, మోహినీకుమారి, రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కమిటీ ఎ.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాసరరావు, వి.బాలాజీ, ఇ.వెంకటేశ్వరరావు, జి.విజయ్‌కుమార్, కె.రామకృష్ణారావు, ఎ.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

డయాలసిస్ వ్యాధిగ్రస్తుడికి రూ.10వేల పింఛన్ అందజేత



పెదమద్దాలి(పామర్రు): పెదమద్దాలి సచివాలయ పరిధిలోని బల్లిపర్రు గ్రామ పంచాయతీకి చెందిన కుందేటి రత్నంకు డయాలసిస్ పెన్షన్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ బాధితుడికి రూ.10 వేల డయాలసిస్ పెన్షన్‌ను అందజేశారు. కార్యక్రమంలో పెదమద్దాలి ఎంపీటీసీ సభ్యురాలు రాజ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్, రాణి, నాగరాజు, శివరామకృష్ణ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి



పెదకళ్లేపల్లిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఏసీ చక్రధరరావు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు కోరారు. మండలంలోని పెదకళ్లేపల్లి నాగేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీవిద్య అధ్యక్షతన పలు శాఖల అధికారులతో కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్ మాట్లాడుతూ కృష్ణానది ఘాట్ల వద్ద స్నానాలు ఆచరించే భక్తులు అధికారులు సూచించిన ప్రదేశంలోనే చేయాలని, వాహనాల పార్కింగ్‌కు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. అనంతరం మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కె.హారిక, ఎస్.శ్రీరామ్ సాయిని కో–ఆర్డినేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యులు కడవకొల్లు సీతారామాంజనేయులు, తహసీల్దార్ శ్రీవిద్య, డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ, విశ్రాంతి వీఆర్వో వెంకటేశ్వరావు, అరజా శ్రీకాంత్, అగ్నిమాపక అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎం హైస్కూల్లోని టెన్త్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత పొందాలనే ఉద్దేశంతో హై –5 యూత్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షురాలు కొల్లిపర అనసూయ సోమవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఎంఈఓ జి.గోపాలరావు, హైస్కూల్ హెచ్ఎమ్ రమణకు మెటీరియల్‌ను అందజేశారు.

విజయవాడ వెళ్లి పెన్షన్ అందజేత

పామర్రు: పామర్రు సచివాలయం–2 పరిధి గాంధీనగర్‌కు చెందిన శ్రీనివాసరావు కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో విజయవాడ గవర్నమెంట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ దొనె శ్రీలత ఆ ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసరావుకు పెన్షన్ అందజేశారు.

గ్రామస్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం



మంటాడలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అన్నారు. మంటాడ గ్రామంలో ఇందిరమ్మ కాలనీ, రెడ్డిపాలెంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన తొమ్మిది సిమెంటు రోడ్లను సోమవారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యులు పరిమిళ నత్వానీ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని డీఎంఎస్ నిధులు రూ.2 కోట్లతో నిర్మించనున్న డ్రెయిన్, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంటాడ గ్రామంలో పర్యటించినపుడు రోడ్ల దుస్థితిని గమనించానన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు, ఎంపీ నిధులు, రాజ్యసభ సభ్యులు నిధులతో 13 రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మిగిలిన రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామన్నారు. నిరంతరం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని, నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న తనను ఆదరించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజారిటీ అందించాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, సర్పంచ్ ఎన్.వీరమ్మ, ఎంపీపీ కె.వేదసుప్రజ, ఎంపీటీసీ సభ్యులు మేరుగు లక్ష్మి, ఎం.రాజ్యలక్ష్మి, పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నబాబు, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, రెడ్డిక, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్లు రాంబాబు, వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, నాయకులు కోటేశ్వరరావు, మస్తాన్‌రావు పాల్గొన్నారు.

గ్యాస్ లీకై కోళ్ల షెడ్డు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

తోట్లవల్లూరు: గ్యాస్ లీకేజీ కారణంగా కోళ్ల షెడ్డు, వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. గ్రామంలోని రైస్‌మిల్ బజారు అంగన్‌వాడీ కేంద్రం వద్ద బి. శ్రీనివాసరావు, మేకల శివరామ్‌కు కోళ్ల షెడ్డు, వరిగడ్డి వామి ఉన్నాయి. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై కోళ్లషెడ్డుకు మంటలు అంటుకున్నాయి. దాని నుంచి సమీపంలోని వరిగడ్డి వామికి కూడా వ్యాపించడంతో ఎకరం వరిగడ్డి కాలిబూడిదైంది. ఆరు కోడిపుంజులు, రెండు కుక్క పిల్లలు చనిపోయాయి. ఉయ్యూరు ఫైర్ అధికారి రవితేజ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. లక్షన్నర ఆస్తినష్టం వాటిల్లినట్లు ఫైర్ సిబ్బంది తెలిపారు.

సాయిబాబా ఆలయంలో చోరీ!



సాయిబాబా గుడి గేటు తాళాలు పగులగొట్టిన దొంగలు

కప్తానుపాలెం(మోపిదేవి): కప్తానుపాలెంలో జాతీయ రహదారి పక్కన సాయిబాబా ఆలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రోజువారీ పూజా కార్యక్రమాలు చేసేందుకు వచ్చిన భక్తులు తాళాలు పగలగొట్టి గేటు తెరచి ఉండటాన్ని గమనించి దొంగతనం జరిగినట్లు నిర్ధారించుకుని ఆలయ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ చోరీ జరిగిందని, ఏ వస్తువులు పోయాయనేది చెప్పడానికి సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేరన్నారు. వారి నుంచి వివరాలు తీసుకోవాల్సి ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. క్లూస్ టీం వచ్చి సేకరించారు. సాయిబాబా విగ్రహం తలపై ఉండే రెండు వెండి కిరీటాలు, సాయిబాబా విగ్రహాన్ని దొంగిలించినట్లు తెలియవచ్చింది.

రేపు సకలేశ్వరస్వామి కల్యాణోత్సవం

మోపిదేవి: స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత సకలేశ్వరస్వామివారి వార్షిక కల్యాణోత్సం బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జె. ప్రవణ తెలిపారు. అందులో భాగంగా ఉదయం 10 గంటలకు స్వామివారిని పెండ్లికుమారుడిని చేస్తారని, సాయంత్రం నాలుగు గంటలకు స్వామివార్లను రావివారిపాలెం వరకు ప్రత్యేక పల్లకీలో ఊరేగిస్తారని పేర్కొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సు సర్వీసులు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం డిపో నుంచి శివరాత్రి సందర్భంగా శైవ క్షేత్రాలైన పెదకళ్లేపల్లి, ఐలూరు, శ్రీశైలం దేవాలయాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీ సాయంత్రం నుంచి 8వ తేదీ సాయంత్రం వరకు పెదకళ్లేపల్లి, ఐలూరులకు ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. పామర్రు నుంచి ఐలూరుకు, కూచిపూడి నుంచి ఐలూరుకు, కాజ, కోసూరు, మొవ్వ, కూచిపూడి మీదుగా ఐలూరుకు ప్రత్యేక బస్సులు నడుపుతామని పేర్కొన్నారు.